సాక్షి అనకాపల్లి

బుధవారం | 2 | ఏప్రిల్ | 2025



సాధుమఠం తీర్థం

తగరపువలస: ఆనందపురం మండలం వెల్లంకి సాధుమఠం తీర్థమహోత్సవాలు మంగళవారం ఘనంగా జరిగాయి.

ఉష్ణోగ్రతలు

మంగళవారం

		గరిష్ఠం/కనిష్ఠం
అనకాపల్లి	:	35.3/24.3
చోడవరం	:	37.0/29.0



అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్: విశాఖ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించారు.

ఆరేళ్ల మేనకోడలిని హతమార్చిన కిరాతకుడికి

ఉరే సరి

పదేళ్ల క్రితం ఆ దుర్ఘటన ఓ సంచలనం.. అందరి హృదయాలను కలచివేసిన విషాదం..

మళ్లీ ఇప్పుడు ఆ కేసులో కోర్టు తీర్పు మరో సంచలనం.. ఆరేళ్ల చిన్నారిని చిదిమేసిన కిరాతకుడికి ఉరి శిక్ష విధించడంతో సర్వత్రా ఆమోదం..



తల్లితో చిన్నారి దివ్య (ఫైల్)

- కోర్టు తీర్పుపై సర్వత్రా హర్షం
- న్యాయం జరిగిందన్న తల్లిదండ్రులు



నిందితుడిని అరెస్టు చేసిన అప్పటి ఎస్‌ఐ జి.ఎన్.అప్పన్న, సీఐ కిరణ్‌కుమార్ (ఫైల్)

దేవరాపల్లి: వరుసకు మేనమామ.. 20 రూపాయలిచ్చి గారెలు కొనుక్కోమన్నాడు.. అవంటే తనకెంతో ఇష్టం.. స్కూలు నుంచి బండిపై తీసుకెళ్లాడు.. హాయిగా తింటూ కబుర్లు చెప్పవచ్చని ఆశించిన ఆరేళ్ల చిన్నారి కొద్ది క్షణాల్లోనే విగత జీవిగా మారింది. అక్కా బావలపై కక్షతో సీసా పెంకులతో బాలికను కిరాతకంగా హతమార్చాడు. వినడానికి, చదవడానికి ఎంతో వేదన కలిగించే ఈ దుర్ఘటనలో ఆ బాలిక ఎంత హింస అనుభవించిందో.. ప్రాణం పోయేవరకు ఎంత గిజగిజలాడిందో.. ఆమెను విగత జీవిగా చూసి తల్లిదండ్రుల హృదయం ఎన్ని ముక్కలయ్యిందో..

పోలీసుల దర్యాప్తు, ప్రాసిక్యూషన్ వాదన ఆ దురాగతాన్ని కళ్లకు కట్టాయి. ఫలితంగా చోడవరంలోని 9వ జిల్లా అదనపు సెషన్స్ కోర్టు అతి పెద్ద శిక్ష విధించింది. అరుదైన కేసుల్లో మాత్రమే విధించే ఉరి శిక్షను అమలు చేయమని కోరుతూ అదనపు జిల్లా న్యాయమూర్తి కె.రత్నకుమారి మంగళవారం తీర్పు చెప్పారు.

పెద్దమ్మ కుమారుడని చేరదీస్తే..

రైవాడ జలాశయం నిర్మాణ సమయంలో బాలిక తాత శ్రీరామ వెంకటేశ్వర్లు కుటుంబం క్వారీ పని కోసం తమిళనాడు నుంచి దేవరాపల్లి వలస వచ్చారు. వెంకటేశ్వర్లు కుమార్తె ధనలక్ష్మికి వేపాడ మురుగన్ అనే వ్యక్తితో వివాహమైంది. వీరికి కుమార్తె దివ్యతోపాటు కుమారుడు ఉన్నాడు. ధనలక్ష్మి పెద్దమ్మ కుమారుడైన సుబ్బాచారి గుణశేఖర్ లారీ క్లీనర్‌గా పనిచేస్తూ దేవరాపల్లి ఉండేవాడు. ఖాళీ సమయాల్లో ధనలక్ష్మి ఇంటి వద్ద నడిపే టిఫిన్ దుకాణంలో సాయం చేస్తూ అక్కడే ఉండేవాడు. వ్యసనాలకు బానిసైన సుబ్బాచారి గుణశేఖర్ ప్రవర్తన నచ్చకపోవడంతో అతడిని తన ఇంటికి రావొద్దంటూ ధనలక్ష్మి చెప్పింది. దీంతో ఆమెపై కక్ష పెంచుకున్న అతడు ధనలక్ష్మితో పాటు కుమార్తె దివ్యను హతమార్చాలని పథకం రచించుకున్నాడు. దివ్యను 2015 డిసెంబర్ 23 సాయంత్రం పాఠశాల నుంచి బయటకు తీసుకువచ్చి రూ.20 చేతికిచ్చి గారెలు కొని తెచ్చుకుందామని నమ్మ బలికి తన ద్విచక్ర వాహనంపై ఎక్కించుకొని బిల్లల మెట్టపై నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లాడు. అక్కడే ఉన్న బీరు సీసాను పగలకొట్టి గాజు పెంకుతో బాలిక పీక కోసి అతి కిరాతకంగా హతమార్చాడు. కుమార్తె కనిపించకపోవడంతో బాలిక తల్లిదండ్రులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈలోగా బాలికను నిందితుడు ద్విచక్ర వాహనంపై ఎక్కించుకొని బిల్లల మెట్ట వైపు వెళ్లడాన్ని చూసినట్లు స్థానికులు చెప్పారు. బాలిక మృతదేహం బిల్లల మెట్టపై పొదల్లో లభించడంతో పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకొని ప్రశ్నించగా నేరం అంగీకరించాడు. అప్పటి ఎస్‌ఐ జి.ఎన్.అప్పన్న (ప్రస్తుతం పాయకరావుపేట సీఐ) కేసు నమోదు చేయగా, సీఐ కిరణ్‌కుమార్ (ప్రస్తుతం విజయవాడ డీఎస్పీ) దర్యాప్తు చేశారు. చోడవరంలోని 9వ జిల్లా అదనపు సెషన్స్ కోర్టులో ఈ కేసు విచారణ జరిగింది. గత ఏడాది నవంబర్‌లో తుది విచారణ ప్రారంభించిన కోర్టు 20 మంది సాక్షుల్ని విచారించింది. బాలికను సుబ్బాచారి గుణశేఖర్ హత్య చేసినట్లు నేరం రుజువు కావడంతో ముద్దాయికి మరణ శిక్ష విధిస్తూ న్యాయమూర్తి మంగళవారం సంచలన తీర్పునిచ్చారు. తీర్పు పట్ల సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

> **నరరూప రాక్షసులకు దడ పుట్టించే తీర్పు**
>
> మా కుమార్తెను అతి దారుణంగా హత్య చేసిన నరరూప రాక్షసుడికి కోర్టు ఉరి శిక్ష విధించడం మాకెంతో ఆనందం కలిగించింది. మా కుమార్తెలా మరెవ్వరికీ అన్యాయం జరగకుండా కోర్టు తీర్పు దోహదపడుతుంది. ముద్దాయికి ఉరి శిక్ష విధించడంతో మా కుమార్తె ఆత్మకు శాంతి చేకూరుతుంది. తీర్పు ఇచ్చిన గౌరవ న్యాయమూర్తికి జీవితాంతం రుణపడి ఉంటాం.
>
> –వేపాద మురుగన్, ధనలక్ష్మి



అమ్మో.. ఒకటో తేదీ!

10,136

పది నెలల్లో తొలగించిన సామాజిక పింఛన్ల సంఖ్య

గత ఏడాది ఏప్రిల్‌లో అందించిన పింఛన్లు **2,66,208**

ఈనెల పింఛన్లు అందుకోనున్న లబ్ధిదారులు **2,56,072**

కోడి కూయకముందే.. అవ్వా తాతలు మంచం మీద నుంచి కాళ్లు కింద పెట్టక ముందే వలంటీర్ నేరుగా ఇంటికే వెళ్లి పింఛను చేతికిచ్చేవాడు.. ఇది ఏడాది క్రితం నాటి మాట.

మరి ఇప్పుడో.. ఒకటో తేదీ వచ్చిందంటే గుండెల్లో గుబులు.. ఈనెల పెన్షన్ వస్తుందో, ఆగిపోతుందోనన్న బెంగ.. ఎందుకంటే కూటమి ప్రభుత్వం వచ్చాక 10 నెలల్లో ఏకంగా 10,136 పింఛన్లకు కోత విధించారు.

మరణించినవారినే తొలగించామని అధికారులు చెబుతున్నారు. నిజంగా అంతమంది మరణించారా..? వాస్తవం ఏమిటో వారికే తెలియాలి.

- వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులే టార్గెట్‌గా ఏరివేత
- కుంటి సాకులతో పెన్షన్లను తొలగిస్తున్న వైనం
- మళ్లీ ధ్రువపత్రాలు తెచ్చుకోవాలని దివ్యాంగులకు వేధింపులు
- కూటమి ప్రభుత్వంలో కొత్త పింఛన్లు ఉత్త మాటే

సాక్షి, అనకాపల్లి: ఒకటో తేదీ వచ్చిందన్న సంతోషం పింఛనుదారుల ముఖాల్లో కనిపించడం లేదు సరికదా.. ఉన్న పింఛను పోతుందేమోనని భయం వారి మదిలో మెదులుతోంది. కూటమి నేతలు తమపై కోపంతో ఎక్కడ పింఛను తొలగిస్తారో.. అనే బెంగ వారిని వెంటాడుతోంది. ఈనెల పెన్షన్ తీసుకున్న సామాజిక పింఛనుదార్లకు వచ్చే నెల అందుకుంటామో లేదో తెలియని పరిస్థితి నెలకొంది. ఒకవేళ పింఛను వస్తే డబ్బుల కోసం ఎక్కడికి రమ్మంటారో.. అంత దూరం ఎలా వెళ్లాలనే బెంగ వారిని వేధిస్తోంది. కానుకగా ఇంటి దగ్గర డబ్బులందుకున్న రోజుల పోయి... కాసుల కోసం వీధి చివర కాపాలా కాసే రోజులు వచ్చాయి. పింఛను ఇంటికే ఇస్తామని ప్రగల్భాలు పలికిన చంద్రబాబు.. గద్దెనెక్కిన తర్వాత నెల నుంచే లబ్ధిదారులకు చుక్కలు చూపిస్తున్నారు. చెప్పిన చోటికి వస్తేనే పింఛనిస్తామంటూ పంపిణీ చేస్తున్న సిబ్బంది హుకుం జారీ చేస్తున్నారు. చివరికి పింఛనుకు కత్తెర పడే రోజులు కూడా బాబు జమానాలో వచ్చేసిందంటూ అవ్వాతాతలు వాపోతున్నారు. నాటి జన్మభూమి కమిటీలను వారు గుర్తు చేసుకుంటున్నారు. వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులే టార్గెట్‌గా ఏరివేత సాగుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

తొలి నెల నుంచి పింఛను వంచన

అధికారంలోకి వచ్చిన తొలి నెల నుంచే పింఛను వంచన మొదలైంది. అది అలా కొనసాగుతూనే ఉంది. గతంలో 14 ఏళ్ల సీఎంగా ఉన్న చంద్రబాబునాయుడు అవ్వా తాతల విషయంలో ఎలా దుర్మార్గంగా వ్యవహరించారో.. ఇప్పుడూ అదే తీరు కనబరుస్తున్నారు. గత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హయాంలో ఒకటో తేదీ ఉదయాన్నే వలంటీర్లు తలుపు తట్టి మరీ.. ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. ఐదేళ్లపాటు అవ్వా తాతలు.. దివ్యాంగులు, వ్యాధిగ్రస్తులు.. ఇలా ప్రతి ఒక్క లబ్ధిదారుడికీ ఎలాంటి కష్టం రాకుండా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కంటికి రెప్పలా కాపాడుకుంటూ పింఛను అందజేసింది. కానీ కూటమి అధికారంలోకి వచ్చాక 10 నెలల్లో. పింఛనుదారుల కష్టాలు పెరుగుతున్నాయే తప్ప.. తగ్గడం లేదు. దివ్యాంగుల నుంచి.. పండుటాకుల వరకూ.. పింఛను పొందేందుకు ప్రత్యక్ష నరకం చూస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 10 నెలల్లోనే 10,136 పింఛన్లకు కోత పడింది. గత చంద్రబాబు ప్రభుత్వంలో (2014–19) జన్మభూమి కమిటీల పెత్తనంతో ఉన్న పెన్షన్లకు ఎలా మంగళం పాడారో.. ఈసారి కూడా అలాగే వ్యవహరిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గత ఏప్రిల్ నెలలో అనకాపల్లి జిల్లాలో 2,66,208 మందికి పింఛన్లు పంపిణీ చేశారు. ఈ ఏప్రిల్ నెలలో 2,56,072 మందికి పెన్షన్లు అందజేస్తున్నారు. అంటే కూటమి ప్రభుత్వం వచ్చాక 10 నెలల్లో 10,136 మంది పింఛన్లకు కోత విధించినట్లు అధికార గణాంకాలే తెలియజేస్తున్నాయి.

> **కొత్త పింఛన్లు కల్లే.**
>
> వైఎస్సార్‌సీపీ హయాంలో ఏడాదికి రెండుసార్లు కొత్త పింఛన్లు ఇచ్చేవారు. ప్రతీ ఏటా జనవరి, జూలై నెలలో అర్హులైన వారందరికీ కొత్త పింఛన్లను అందించడం జరిగింది. రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా లబ్ధిదారులను ఎంపిక చేశారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే చాలు.. వలంటీర్లు ఇంటి వద్దకే వెళ్లి మంజూరు పత్రం అందజేసిన పరిస్థితులు ఉండేవి. కానీ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక 10 నెలల్లో కొత్త పింఛన్లు ఇవ్వలేదు సరికదా.. ఉన్న పింఛన్లనే తొలగిస్తున్న పరిస్థితులున్నాయి.



వితంతువులకు ఆర్థిక సహాయం అందిస్తున్న సర్పంచ్ గొల్లవిల్లి చిన్నమ్మలు, వైస్ ఎంపీపీ ధర్మిశెట్టి స్వాతి

వితంతువులకు చేయూత

వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధుల ఆదర్శం
ప్రతి నెలా వెయ్యి రూపాయల సాయం

చీడికాడ: భర్త మృతి చెంది ఏడాది గడుస్తున్నా ప్రభుత్వం నేటి వరకు పట్టించుకోకపోవడంతో వరాహపురం సర్పంచ్ గొల్లవిల్లి చిన్నమ్మలు, వైస్ ఎంపీపీ ధర్మిశెట్టి స్వాతి వారిని ఆదుకునేందుకు ముందుకు వచ్చారు. గ్రామానికి చెందిన ఏడుగురికి తమ గౌరవ వేతనం నుంచి నెలకు వెయ్యి రూపాయలు అందిస్తున్నారు. గ్రామానికి చెందిన మిస్కా శ్యామల, శెట్టి నాగరాజమ్మ, ధర్మిశెట్టి రమణమ్మ, బలిజి దేముళ్లమ్మ, యలమంచిలి అప్పలకొండ, మిస్కా దేముడమ్మ, బాలిబోయిన చిన్నమ్మలు భర్తలు ఈ ఏడాది కాలంలో మృతి చెందడంతో వారు వితంతు పింఛన్ల కోసం సచివాలయాల్లో దరఖాస్తు చేసుకున్నారు. నేటికీ వారికి పింఛన్లు మంజూరు చెయ్యకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీరికి పింఛన్లు మంజూరు చెయ్యాలని మూడు మాసాల క్రితం ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన పీజీఆర్‌ఎస్ కార్యక్రమంలో అర్జీలు అందించినట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు తెలిపారు. ఏడాది కాలంగా ఎన్నిసార్లు దరఖాస్తులు చేసుకున్నా పింఛన్లు మంజూరు కాలేదన్నారు. దీంతో ఈ నెల నుంచి తమ గౌరవ వేతనం నుంచి ఏడుగురు వితంతువులకు ప్రతి నెలా రూ.1000 చొప్పున అందించేందుకు ఇద్దరు ప్రజా ప్రతినిధులు ముందుకు వచ్చారని చెప్పారు. ఈ నెల నుంచి ఆర్థిక సాయం అందజేస్తున్నారని, తమ పదవీ కాలం ఉన్నంత వరకు అందిస్తామని హామీ ఇచ్చారన్నారు. ప్రభుత్వం వీరికి పింఛన్లు వెంటనే మంజూరు చెయ్యాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ నేత ధర్మిశెట్టి కొండబాబు, స్కూల్ కమిటీ చైర్మన్ మిస్కా అప్పారావు, మాజీ ఎంపీటీసీ అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ నేతలు అచ్చిబాబు, యలమంచిలి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

> **పింఛన్ల కోత లేదు..**
>
> ప్రతి నెలలో మరణించినవారి పింఛన్లను మాత్రమే తొలగిస్తున్నాం. అంతే తప్ప కొత్తగా కోత విధించలేదు. భర్త చనిపోతే ఆయన పేరు మీద ఉన్న పింఛన్.. భార్య పేరు మీదకు మారుస్తున్నాం. అలా 630 మందిని చేర్చాం.
>
> – శచీదేవి, డీఆర్‌డీఏ పీడీ, అనకాపల్లి

న్యూస్‌రీల్

నూకాంబిక సన్నిధిలో శాప్ ఎండీ గిరీష్



నూకాంబిక అమ్మవారిని దర్శించుకుంటున్న శాప్ వైస్ చైర్మన్ గిరీష్

అనకాపల్లి: నూకాంబిక అమ్మవారిని శాప్ (స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఏపీ) వైస్ చైర్మన్, ఎండీ పీఎస్ గిరీష మంగళవారం దర్శించుకున్నారు. అమ్మవారికి పట్టు వస్త్రాలను అందజేసి, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈవో వెంపల రాంబాబు శాలువాతో సత్కరించి, అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు.

ముగిసిన టెన్త్ పరీక్షలు



జిల్లా విద్యాశాఖాధికారి అప్పారావునాయుడు

అనకాపల్లి టౌన్: జిల్లాలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. చివరి రోజైన మంగళవారం సోషల్ పరీక్ష జరిగింది. పరీక్షలు సజావుగా సాగడానికి కృషి చేసిన, సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావునాయుడు తెలిపారు. కలెక్టర్, ఎస్పీ సలహాలతో ఎటువంటి ఇబ్బంది కలగకుండా పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయన్నారు. రెవెన్యూ, పోలీస్, వైద్య, ఆరోగ్య శాఖ, విద్యుత్, తపాలా ఆర్టీసీ, జీవీఎంసీ, పురపాలక, పంచాయతీ, సచివాలయ అధికారులు, సిబ్బంది పరీక్షల నిర్వహణకు సహకరించారన్నారు. అందరి కృషితో ఎటువంటి ఇబ్బందులు పడకుండా పదో తరగతి బోర్డు పబ్లిక్, ఓపెన్ స్కూల్ పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించామన్నారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో భాగంగా మంగళవారం జరిగిన సాంఘిక పరీక్షకు జిల్లాలో 99.54 శాతం మంది హాజరయ్యారని డీఈవో తెలిపారు.

పన్నుల వసూళ్లలో నర్సీపట్నం టాప్

- గత ఏడాది కంటే 12.50 శాతం అదనపు రాబడి
- రాష్ట్రంలో నర్సీపట్నం మున్సిపాలిటీకి 8వ స్థానం
- మున్సిపల్ కమిషనర్ సురేంద్ర వెల్లడి



నర్సీపట్నం: ఇంటి పన్నుల వసూళ్లలో రాష్ట్రంలో నర్సీపట్నం మున్సిపాలిటీ టాప్‌లో నిలిచిందని మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో 123 మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో నర్సీపట్నం పురపాలక సంఘానికి 8వ స్థానం లభించిందన్నారు. పన్నుల వసూళ్లలో మెరుగైన ఫలితాలు సాధించటం వెనుక రెవెన్యూ సిబ్బంది, సచివాలయ సిబ్బంది కృషి ఎంతో ఉందన్నారు. పురపాలక సంఘానికి చెల్లించవలసిన ఇంటి పన్నుల బకాయిలు, ఖాళీ జాగా పన్నులు, ప్రైవేటు మంచి నీటి కుళాయి పన్నులు, టౌన్ ప్లానింగ్ విభాగానికి చెందిన డిస్‌ప్లే డివైజెస్ ఫీజులు 2023–24 కంటే 2024–25 సంవత్సరంలో 12.50 శాతం అదనంగా వసూలు చేశామన్నారు. పురపాలక సంఘానికి పన్నులు చెల్లించి సహకరించిన ప్రజలు, ప్రజాప్రతినిధులు, కౌన్సిల్ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. గత ఏడాది ఇంటి పన్నులు, ఖాళీ జాగా పన్నులు రూ.4.73 కోట్లు వసూలు కాగా ఈ ఏడాది మార్చి నాటికి రూ.5.62 కోట్లు వసూలు చేశామన్నారు. ఈ నెల 31వ తేదీ ఆఖరు రోజున రూ.30 లక్షలు వసూలైందన్నారు.

నేడు సబ్సిడీ రుణాలకు ఇంటర్వ్యూలు

బీసీ, బ్రాహ్మణ, క్షత్రియ, రెడ్డి, వైశ్య, ఈబీసీ కాపు కార్పొరేషన్ల ద్వారా వివిధ రకాల యూనిట్లకు సబ్సిడీతో కూడిన బ్యాంకు రుణాల మంజూరుకు బుధవారం బ్యాంక్ మేనేజర్ల సమక్షంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని మున్సిపల్ కమిషనర్ సురేంద్ర తెలిపారు. మున్సిపాలిటీలోని 17 సచివాలయాల నుంచి 380 మంది లబ్ధిదారులు దరఖాస్తులు చేసుకున్నారన్నారు. దరఖాస్తులను పరిశీలించి అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు బుధవారం ఉదయం 10 గంటలకు పురపాలక కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామన్నారు. దరఖాస్తుదారులు ఆన్‌లైన్‌లో పెట్టుకున్న దరఖాస్తు, ఆధార్ కార్డు జిరాక్స్, రేషన్ కార్డు, కుల, ఆదాయ ధ్రువపత్రాల జిరాక్స్‌లు తీసుకురావాలన్నారు. వాహనానికి దరఖాస్తు చేసుకుంటే డ్రైవింగ్ లైసెన్స్ జిరాక్స్, ఆధార్, రేషన్ కార్డులు, కుల, ఆదాయ పత్రాలతో ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు.

అపూర్వ సమ్మేళనం 8లో

దైవ దర్శనానికి వెళుతూ..

- రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం.. మరొకరికి గాయాలు
- వీరంతా ఒకే గ్రామానికి చెందిన మిత్రులు
- గొడిచర్ల సమీపంలో ద్విచక్ర వాహనాలను కారు ఢీకొనడంతో ప్రమాదం



చక్రరావు (ఫైల్)



శివ (ఫైల్)



ఘటనా స్థలంలో చక్రరావు మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

నక్కపల్లి: జాతీయ రహదారిపై గొడిచర్ల సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు దుర్మరణం పాలయ్యారు. ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. పాయకరావుపేట మండలం సత్యవరం గ్రామానికి చెందిన మిత్రులు కీర్తి చక్రరావు (52), గోళ్ల శివ (48), వెంకటరమణలు కలిసి రెండు మోటారు సైకిళ్లపై రేబాక గ్రామంలో ఉన్న గూడుపమ్మతల్లి ఆలయానికి దర్శనం కోసం వెళ్తున్నారు. గొడిచర్ల దాటిన తర్వాత వీరు ప్రయాణిస్తున్న మోటారు సైకిళ్లను గొడిచర్ల సమీపంలో ఇన్నోవా వాహనం వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో చక్రరావు, శివలు ప్రయాణిస్తున్న మోటారు సైకిల్ పక్కనే ఉన్న పొలాల్లోకి దూసుకుపోయింది. ఈ ఘటనలో చక్రరావు తలకు బలమైన గాయాలు కావడంతో ఘటనా స్థలంలో మరణించాడు. శివతో పాటు మరో బైక్‌పై వెనుక వస్తున్న వెంకటరమణకు కూడా తీవ్ర గాయాలయ్యాయి. వీరిద్దరిని తుని ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శివ ఆస్పత్రిలో మరణించాడు. ప్రమాద విషయాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు, అంబులెన్స్‌లకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు వచ్చి ఎటువంటి ట్రాఫిక్ సమస్యలు ఏర్పడకుండా చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. చక్రరావు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం నక్కపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రి వద్ద మృతుని బంధువులు బోరున విలపిస్తున్నారు. ఇన్నోవా వాహనం డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కుమారస్వామి తెలిపారు.



ప్రమాదం జరిగింది ఇక్కడే..

సత్యవరంలో విషాదం

మృతుల స్వస్థలం పాయకరావుపేట సత్యవరం గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. రోడ్డు ప్రమాదంలో గ్రామానికి చెందిన కీర్తి చక్రరావు, గోళ్ల శివ మరణించడంతో గ్రామ ప్రజలు కన్నీరు పెట్టుకున్నారు. చక్రరావుకి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. శివకి కూడా ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతులు వ్యవసాయ కూలీలుగా కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. వారి మరణంతో రెండు కుటుంబాలు ఇంటి పెద్ద దిక్కును కోల్పోయి రోడ్డున పడ్డాయి. బాధిత కుటుంబాలకు చెందిన వారి రోదనలతో నక్కపల్లి, తుని ఆస్పత్రులు ప్రతిధ్వనించాయి.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వెంకటరమణ

ఈనెల 5తో గోవాడ గానుగాట ముగింపు

చోడవరం: గోవాడ సుగర్ ఫ్యాక్టరీ క్రషింగ్‌ను ఈనెల 5వ తేదీతో ముగించనున్నట్టు ఫ్యాక్టరీ మేనేజింగ్ డైరెక్టర్ వి.వి.సన్యాసినాయుడు మంగళవారం చెప్పారు. ఇప్పటి వరకు 99 వేల టన్నులు గానుగాడామని, మరో 10 వేల టన్నుల వరకు క్రషింగ్ చేసేందుకు అవసరమైన చెరకు అగ్రిమెంట్లు ఉన్నాయన్నారు. ఈ ఏడాది క్రషింగ్ లక్ష్యం 1.5 లక్షల టన్నులు పెట్టుకున్నప్పటికీ ఆకస్మికంగా కొన్ని అవాంతరాలు కలగడం వల్ల ఆశించిన మేర లక్ష్యం చేరుకోలేకపోయామన్నారు. ఈనెల 5వ తేదీనాటికి చెరకు ఉన్నంత మేరకు క్రషింగ్ పూర్తవుతుందని, అందుకే ఆఖరు తేదీగా గడువు నిర్ణయించడం జరిగిందన్నారు. ఇంకా రైతుల వద్ద చెరకు ఉన్నట్లయితే మరో రెండ్రోజులు క్రషింగ్ చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు.

నాటుసారా నిర్మూలనకు ‘నవోదయం’

- సమష్టి కృషితో విజయవంతం చేయాలి
- సమన్వయ కమిటీ సమావేశంలో కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల: జిల్లాను నాటుసారా రహిత జిల్లాగా మార్చడమే నవోదయం 2.0 ప్రధాన ఉద్దేశమని కలెక్టర్ విజయ కృష్ణన్ అన్నారు. ఇందుకు అందరూ కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో మంగళవారం జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో ‘నవోదయం 2.0’ పై పోలీస్, అటవీ, పంచాయతీరాజ్, గిరిజన శాఖలతో జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా చుట్టూ చాలా జిల్లాల సరిహద్దు ప్రాంతాలు ఉండడంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు మరింత సూక్ష్మ దృష్టిని సారించాలన్నారు. ప్రతి గ్రామ, మండల స్థాయిలో కమిటీలను నియమించి విధులు, బాధ్యతలను అవగాహన పరచాలన్నారు. నాటుసారా నిర్మూలనకు గ్రామస్థాయి కార్యాచరణ రూపొందించాలని సూచించారు. నాటుసారా సేవించడం వల్ల కలిగే ప్రమాదాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కలిగించాలన్నారు. జిల్లాలో ఏ కేటగిరీలో 21 గ్రామాలు, బీ కేటగిరిలో 45 గ్రామాలు, సీ కేటగిరిలో 85 గ్రామాలను గుర్తించడం జరిగిందన్నారు. నవోదయం 2.0 కార్యక్రమం ద్వారా అర్హులైన వారు ప్రత్యామ్నాయ ఉపాధి పొందేలా బ్యాంకు రుణాలు ఇప్పించేందుకు సహకరిస్తామన్నారు.

కఠిన శిక్షలు

నాటు సారా తయారీ, రవాణా విక్రయాలు కొనసాగించే వారిపై ఇకపై కఠిన చర్యలు ఉంటాయని కలెక్టర్ చెప్పారు. తొలుత తహసీల్దార్ వద్ద రూ.లక్ష పూచీకత్తుతో బైండోవర్ చేయడం జరుగుతుందన్నారు. తర్వాత ఏడాదిపాటు బెయిల్ రాకుండా పీడీ యాక్ట్ నమోదవుతుందన్నారు. 8 సంవత్సరాల జైలు శిక్షతోపాటు రూ.5 లక్షల వరకు జరిమానా విధించవచ్చన్నారు. జిల్లాలో నాటుసారా తయారుచేసినా, రవాణా చేసినా, నిల్వ చేసినా, అమ్మకాలు జరిపినా 14405 టోల్ ఫ్రీ నెంబరుకు కాల్ చేయవచ్చని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. సమస్యాత్మకంగా ఉన్న గ్రామాల్లో నిర్వహించే సమావేశాలకు ఎస్‌హెచ్‌వోలు హాజరు కావాలన్నారు. గతంలో నాటుసారా తయారు చేసిన వారి కుటుంబ సభ్యులకు ఉపాధి కల్పించేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ సూర్జిత్ సింగ్, జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి వి.సుధీర్, జిల్లా అటవీశాఖ అధికారి శామ్యూల్, జిల్లా అదనపు ఎస్పీ (క్రైమ్) మోహన్‌రావు, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి నాగ శిరీష, ఎక్సైజ్ శాఖ ఇన్‌స్పెక్టర్లు, ఇతర జిల్లా అధికారులు, పాల్గొన్నారు.



నవోదయం 2.0 సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్

క్లుప్తంగా

వృద్ధుడు అదృశ్యంపై ఫిర్యాదు

అనకాపల్లి: విశాఖ, సింహాచలం, జేఎన్‌యూఆర్‌ఎం కాలనికి చెందిన వేపా అప్పారావు(73) గత ఏడాది అక్టోబర్ 24న సింహాచలం నుంచి అనకాపల్లి మిరియాల కాలనీలో నివసిస్తున్న అప్పారావు చెల్లెలు శ్రీపాద లక్ష్మి ఇంటికి వెళ్లాడు. అయితే నేటికీ తిరిగి రాకపోవడంతో అప్పారావు కుమారుడు వేపా అచ్యుత రామకృష్ణ మంగళవారం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు ఎస్‌ఐ డి.ఈశ్వరరావు తెలిపారు. అప్పారావు కొన్ని సంవత్సరాలుగా మానసిక వ్యాధితో బాధపడుతున్నట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ చెప్పారు.

చెరువులో జారిపడి ట్రాక్టర్ డ్రైవర్ మృతి

కశింకోట: మండలంలోని ఉగ్గినపాలెం గ్రామం వద్ద కాల కృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లి చెరువు నీటి ఊబిలో మునిగి కూరుకుపోయి ట్రాక్టర్ డ్రైవర్ దుర్మరణం చెందాడు. మంగళవారం జరిగిన ఈ సంఘటనకు సంబంధించి సీఐ అల్లు స్వామినాయుడు అందించిన వివరాలు...ఉగ్గినపాలెం గ్రామానికి చెందిన కరణం ఈశ్వరరావు (54) తెల్లవారుజామున తన ఇంటి సమీపంలోని చెరువు వద్దకు కాల కృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లాడు. ఈ సమయంలో చెరువులో దిగి ప్రమాదవశాత్తూ జారి పడి ఊబిలో కూరుకుపోయి మునిగి మృతి చెందాడు. ఈ విషయాన్ని గుర్తించిన స్థానికులు పోలీసుల సహకారంతో మృతదేహాన్ని వెలికి తీశారు. అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఈ ఘటనపై భార్య మహేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.మృతునికి ఇద్దరు పిల్లలున్నారు.

పలు కోర్సుల్లో ఉచిత శిక్షణ

డాబాగార్డెన్స్(విశాఖ): హెచ్‌పీసీఎల్ ఆధ్వర్యంలో నడుపుతున్న స్కిల్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్‌లో బొల్లినేని మెడ్ స్కిల్స్ సంయుక్తంగా బ్యూటీషియన్, హోటల్ మేనేజ్‌మెంట్, జనరల్ డ్యూటీ అసిస్టెంట్(నర్సింగ్), ప్రొడక్షన్ మిషన్ ఆపరేటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇచ్చి, ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్టు బొల్లినేని మెడ్ స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఈ కోర్సులు నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ సెకండ్ ఫ్లోర్‌లో గల స్కిల్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్‌లో నిర్వహించనున్నట్టు చెప్పారు. కోర్సుల్లో ప్రవేశం పొందే వారు ఇంటర్మీడియట్, డిప్లమో, ఐటీఐ, పదో తరగతి పూర్తి చేసి 18 నుంచి 28 ఏళ్లలోపు విద్యార్థులు అర్హులన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ప్రముఖ సంస్థల్లో ఉద్యోగాలు కల్పించనున్నట్టు పేర్కొన్నారు. వివరాలకు 9381667986, 72079 53919 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

అపూర్వ సమ్మేళనం

- 1970 -1995 వరకు చదువుకున్న 27 బ్యాచ్‌ల విద్యార్థుల సమావేశం
- పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే గణేష్



హెచ్‌ఎంలు ఇన్నయ్య, జోజిబాబు చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న పూర్వ విద్యార్థి, మాజీ ఎమ్మెల్యే గణేష్



కూచిపూడి నృత్యం చేస్తున్న చిన్నారులు

నర్సీపట్నం: అక్కడ పాత మిత్రులు జ్ఞాపకాలు కలబోసుకున్నారు. సుమారు 30 ఏళ్ల నాటి ముచ్చట్లు చెప్పుకున్నారు. అప్పటి గురువులను స్మరించుకున్నారు. నర్సీపట్నం మున్సిపాలిటీ పరిధి పెదబొడ్డేపల్లి ఆర్‌సీఎం స్కూల్ 1970 నుంచి 1995 వరకు పదో తరగతి వరకు చదువుకున్న 27 బ్యాచ్‌ల పూర్వ విద్యార్థులు స్కూల్ ప్రాంగణంలో మంగళవారం సమావేశమయ్యారు. పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం ఆద్యంతం అలరించింది. పాతశాలకు చెందిన పూర్వ విద్యార్థుల సంఘం నిర్వహించిన ఈ కార్యక్రమంలో దశాబ్దాల క్రితం నాటి స్నేహ బృందాలు కలుసుకున్నాయి. ఆనందోత్సాహాలతో సందడి చేసింది. ఈ పాఠశాలలో చదివి ఇంజినీర్లు, టీచర్లు, లాయర్లు, సాఫ్ట్‌వేర్ నిపుణులు, రాజకీయ ప్రముఖులు వంటి ఉన్నత స్థానాలకు ఎదిగిన వారంతా తమ పాత స్మృతులను నెమరవేసుకున్నారు. ఒకరి యోగక్షేమాలను ఒకరు అడిగి తెలుసుకున్నారు. తాము జీవితంలో ఎలా ఎదిగిందీ..ఒకరినొకరు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత పాఠశాల పరిస్థితులు, వాటి అభివృద్ధి గురించి ఆరా తీశారు. విద్యార్థుల ఉన్నతికి ఎనలేని కృషి చేసిన అప్పటి హెచ్‌ఎంలు ఇన్నయ్య, జోజిబాబు ఫాదర్స్ చిత్రపటాల వద్ద పూర్వ విద్యార్థులు నివాళులర్పించారు. ఇద్దరు గురువులను స్మరించుకున్నారు. ఇద్దరు హెచ్‌ఎంలు, అప్పటి గురువులు అందించిన ప్రోత్సాహంతోనే ఈ రోజు ఈ స్థితిలో ఉన్నామని వారి భావాలను వ్యక్త పరిచారు. పూర్వ విద్యార్థి, మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అపూర్వ సమ్మేళనంలో పాల్గొని, తోటి పూర్వ విద్యార్థులతో తన అనుభవాలను పంచుకున్నారు. రాజకీయాల్లో తనదైన ముద్ర వేసుకుని ఎమ్మెల్యేగా సేవలు అందించిన మాజీ ఎమ్మెల్యే గణేష్‌తో పూర్వ విద్యార్థులు ఫొటోలు దిగేందుకు పోటీ పడ్డారు. అనంతరం పలువురు ప్రముఖులను సన్మానించారు. పాఠశాల అభివృద్ధికి తీసుకోవాల్సిన కార్యచరణను సభలో చదివి వినిపించారు. ఆర్థికంగా వెనకబడిన పూర్వ విద్యార్థులకు సహాయపడాలని కూడా పూర్వ విద్యార్థులు నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం విశేషంగా ఆకట్టుకుంది. పలువురు గురువులను సన్మానించారు. 27 బ్యాచ్‌ల పూర్వ విద్యార్థులు చదువులమ్మ ఒడిలో ఉదయం నుంచి సాయంత్రం వరకూ సరదాగా గడిపారు.



గురువు ఆనందరావును సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు



హాజరైన పూర్వ విద్యార్థులు

పింఛన్ల పంపిణీ ప్రారంభం



లబ్ధిదారులకు పింఛన్ అందజేస్తున్న జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్



గుండిపాలలో పింఛన్ అందిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

గొలుగొండ/పరవాడ: జిల్లాలో సామాజిక పింఛన్ల పంపిణీని మంగళవారం ఉదయం ప్రారంభించారు. గొలుగొండ మండలం గుండిపాల గ్రామంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు పెన్షన్లను పంపిణీ చేశారు. పరవాడ మండలం వాడచీపురుపల్లి గ్రామంలో కలెక్టర్ విజయ కృష్ణన్ లబ్ధిదారులకు పింఛన్ అందించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడుతూ పింఛన్ల కోసం ఎవరైనా లంచం అడుగుతున్నారా? అవకతవకలేమైనా ఉన్నాయా? అని ఆరా తీశారు. అనంతరం స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా గ్రామంలో 89 మంది వ్యాపారులకు తడి, పొడి చెత్త బుట్టలను ప్రత్యేక అధికారి గిరిషా అందించారు.

ఇంజినీరింగ్ విద్యార్థిని ఆత్మహత్య

పెదగంట్యాడ: సంజీవికాలనీకి చెందిన ఓ విద్యార్థిని ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. న్యూపోర్టు పోలీసులు తెలిపిన వివరాలివి.. మండలంలోని సంజీవికాలనీలో పైల అప్పారావు, సూర్యావతి దంపతులు కుటుంబంతో నివాసం ఉంటున్నారు. అప్పారావు కలాసీగా పని చేస్తుండగా సూర్యావతి బ్రాండిక్స్‌లో పని చేస్తోంది. వీరికి ఒక కుమారుడు, కుమార్తె దివ్య(21) ఉన్నారు. దివ్య నరవలోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో, కుమారుడు గుడ్లవల్లేరులో చదువుతున్నా డు. రంజాన్ సందర్భంగా సోమ వారం కళాశాలకు సెలవు కావడంతో దివ్య ఇంట్లోనే ఉంది. తల్లి బీ షిఫ్ట్‌కు బ్రాండిక్స్‌కు వెళ్లిపోయింది. కాగా.. రాత్రి 9.30 గంటల సమయంలో ఓ వ్యక్తి అప్పారావుకు ఫోన్ చేశాడు. దివ్య ఫోన్ ఎత్తడం లేదని తెలిపాడు. దీంతో అప్పారావు వెంటనే ఇంటికి చేరుకున్నాడు. తలుపులు వేసి ఉండడంతో ఎంత కొట్టినా తెరవలేదు. దీంతో తన తోడల్లుడు సాయంతో కిటికీని విరగ్గొట్టి ఇంట్లోకి వెళ్లి చూడగా.. బెడ్ రూమ్‌లో దివ్య ఫ్యాన్ హుక్‌కు చీరతో ఉరివేసుకుని కనిపించింది. వెంటనే న్యూపోర్టు పోలీసుల కు సమాచారం అందించారు. పోలీసులు సంఘట న స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. అప్పారావు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రిటైర్డ్ ఎస్‌బీ డీఎస్పీ అప్పారావుకు సత్కారం



పదవీ విరమణ పొందిన డీఎస్పీ అప్పారావు దంపతులను సత్కరిస్తున్న ఎస్పీ

అనకాపల్లి: పోలీస్ శాఖలో అంకితభావంతో విధులు నిర్వహించిన ప్రతి ఒక్కరికి గుర్తింపు ఉంటుందని, పదవీ విరమణ పొంది ఉద్యోగులు ప్రశాంతమైన వాతావరణంలో జీవించాలని ఎస్పీ తుహిన్ సిన్హా అన్నారు. స్థానిక రింగ్‌రోడ్డు సన్ క్యాస్టల్ కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం రాత్రి జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 34 సంవత్సరాల పాటు అప్పారావు పోలీస్ శాఖలో వివిధ హోదాల్లో విధులు నిర్వహించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఎస్పీ రవివర్మ, అదనపు ఎస్పీలు ఎం.దేవప్రసాద్, ఎల్.మోహనరావు, డీఎస్పీలు ఎం.శ్రావణి, పి.శ్రీనివాసరావు, వి.విష్ణు స్వరూప్, ఈ.శ్రీనివాసు, ఏవో ఏ.రామకుమార్, సీఐలు టి.వి.విజయకుమార్. ఎం.వెంకటరమణ, లక్ష్మణమూర్తి, బాలసూర్యారావు, లక్ష్మి, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్ వద్ద ఉపాధ్యాయుల ధర్నా



ఫ్యాప్టో సమావేశంలో సంఘీభావం వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నేతలు

అనకాపల్లి: ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఏఆర్, పీఆర్సీలు ప్రకటించాలని, విద్యారంగం, ఆర్థిక పరమైన సమస్యలు పరిష్కరించాలని ఈనెల 2న కలెక్టర్ కార్యాలయం వద్ద మధ్యాహ్నం 3 గంటలకు నిరసన కార్యక్రమాన్ని ఫ్యాప్టో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) జిల్లా చైర్మన్ బోయిన చిన్నారావు తెలిపారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫ్యాప్టో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతుందన్నారు. సీపీఎస్, జీపీఎస్‌లను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, ప్రభుత్వం బకాయిపడ్డ మూడు డీఏలను వెంటనే మంజూరు చేయాలని, పీఆర్సీ కమిషన్ నియమించాలని, ఆలస్యమైతే తక్షణమే 30% మధ్యంతర భృతిని ప్రకటించాలని అన్నారు. 2004 కంటే ముందు ఉపాధ్యాయ వృత్తిలో చేరిన 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు కేంద్రం అమలు పరిచిన జీవో 57 ను అమలు చేసి వారికి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాని, ఆంగ్ల మాధ్యమంతో పాటు సమాంతరంగా తెలుగు, ఉర్దూ మాధ్యమాలను కొనసాగించాలని, పంచాయతీ రాజ్ యాజమాన్యంలో పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలను తక్షణమే అమలు చేయాలని, 11వ పీఆర్సీ, డీఏ బకాయిలను తక్షణమే చెల్లించాలన్నారు. ప్రభుత్వం, పంచాయతీ రాజ్ ఉపాధ్యాయులకు ఉమ్మడి సర్వీసు రూల్స్‌కు సంబంధించిన 72 ,73, 74 జీవో అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కార్యదర్శి వై.సుధాకర్ రావు, కె.ఎస్.ఎస్.ప్రసాద్, కోశాధికారి ఎస్.దుర్గాప్రసాద్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి శ్రీలక్ష్మి, సభ్యులు ఎం. శ్రీనివాసరావు, వై. శ్రీనివాసరావు, చల్ల నాగేశ్వరావు పాల్గొన్నారు.

క్వారీ క్రషర్స్ కార్మికుల సమ్మె

11వ వేతన సవరణ చేయాలని డిమాండ్



మండలంలో బవులవాడ స్టోన్ క్రషర్ వద్ద సమ్మె చేస్తున్న కార్మికులు

అనకాపల్లి: రెక్కాడితేగాని డొక్కాడని జీవితాలతో మండలంలో వివిధ స్టోన్ క్రషర్స్‌లో క్వారీ డ్రిల్లింగ్, బ్లాస్టింగ్ చేస్తున్న కార్మికులకు 11వ వేతన ఒప్పందం క్వారీ యజమానులు అమలు చేయకపోవడం అన్యాయమని జిల్లా క్వారీ క్రషర్స్ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి కోనమోహనరావు అన్నారు. బవులవాడ పంచాయతీ దర్జినగర్ గ్రామంలో క్వారీ కార్మికులు మంగళవారం సమ్మె బాట పట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న నిత్యవసర ధరలకు అనుగుణంగా కార్మికుల వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. క్వారీల్లో డ్రిల్లింగ్ చేసే కార్మికులకు (ఒక అడుగు) డ్రిల్లింగ్ కార్మికులకు రేటు రూ.10 పెంచాలని, కంప్రెషర్ యజమానులు రూ.30 పెంచాలని, క్వారీ, స్టోన్ క్రషర్స్‌లో ప్రమాదం జరిగి కార్మికుడు మరణించినప్పుడు ఆ కార్మికుడి కుటుంబానికి నష్టపరిహారంగా రూ.25 లక్షలు చెల్లించి, అంత్యక్రియల ఖర్చులకు రూ.2 లక్షలు చెల్లించాలని, క్వారీ, స్టోన్ క్రషర్స్‌లో ప్రమాదం జరిగి కార్మికుడు అంగవైకల్యానికి గురైతే 'వర్క్ మెన్ కాంపెన్షేషన్ యాక్ట్-1923' ప్రకారం (క్వారీ, స్టోన్ క్రషర్స్ యాజమాన్యం) నష్టపరిహారం చెల్లించి, వైద్యం ఖర్చులు పూర్తిగా యాజమాన్యమే భరించాలన్నారు. ప్రమాద భత్యంగా కార్మికుడికి పూర్తిగా నయం అయ్యేవరకు కుటుంబ పోషణకు వారానికి రూ.3వేలు ఇవ్వాలని, కంప్రెషర్ డ్రైవర్లకు ప్రస్తుతం ఇస్తున్న నెల జీతం రూ.6 వేలు నుంచి రూ.12 వేలకు పెంచాలని, సంక్రాంతి లేదా దసరాకు ఒక జత బట్టలు బోనస్ ఇవ్వాలని, కార్మికులకు రూ.10 లక్షలు బీమా యాజమాన్యం చేయించాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నా యకులు శానాపతి అప్పలనాయుడు, చింతల రమేష్, సేనాపతి సూరిబాబు, ముమ్మిన శ్రీను, ఎ.అప్పలనాయుడు, జొమ్మల రమణ, కోరుకొండ నాయుడు, బవులవాడ, ఊడేరు, మార్టూరు, మాకవరం, మామిడిపాలెం గ్రామాల కార్మికులు పాల్గొన్నారు.

పునరావాస ఏర్పాట్లు త్వరగా పూర్తిచేయాలి

కలెక్టర్ విజయకృష్ణన్



బోదిగల్లంలో భూములు పరిశీలిస్తున్న కలెక్టర్

నక్కపల్లి: ఏపీఐఐసీ నిర్వాసితులకు పునరావాసం కల్పించడానికి భూసేకరణ ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులు ఆదేశించారు. మంగళవారం ఆమె పెద బోదిగల్లంలో పునరావాసం కోసం ఎంపిక చేసిన భూములను పరిశీలించారు. మొత్తం ఎంత భూమి గుర్తించారు.. ఇప్పటి వరకు ఎన్ని ఎకరాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయింది.. అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటు కాబోయే ప్రాంతాల్లో ఏపీఐఐసీ వారు చేపట్టిన భూసేకరణలో, నివాస ప్రాంతాలు కోల్పోయిన వారికి సుమారు 800 మందికి పైగా నిర్వాసితులకు పునరావాసం కల్పించాల్సి ఉందన్నారు. వీరందరికి బోదిగల్లం వద్ద పునరావాసం కల్పించేందుకు నిర్ణయించామన్నారు. సుమారు 170 ఎకరాలను గుర్తించి నేరుగా రైతులనుంచి కొనుగోలు చేయడం జరుగుతోందన్నారు. రిజిస్ట్రేషన్‌ల ప్రక్రియ మొదలయిందన్నారు. త్వరగా పూర్తిచేసి గుర్తించిన భూముల్లో లేఅవుట్లు వేసి నిర్వాసితులకు కేటాయించాల్సి ఉంటుందన్నారు. పునరావాసం పొందే నిర్వాసితులకు అవసరమైన తాగునీరు, విద్యుత్ సదుపాయాలు, వాడుకనీరు, రోడ్లు, డ్రెయినేజీ సదుపాయాలు కల్పించాల్సి ఉందన్నారు. నిర్వాసితులకు నివాస యోగ్యంగా ఉండే అన్ని సదుపాయాలు త్వరగా కల్పించాలన్నారు. బల్క్ డ్రగ్ పార్క్ కోసం అదనంగా మరో వెయ్యి ఎకరాలు సేకరించాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఏపీఐఐసీ ద్వారా పెదతీనార్ల, జానకయ్యపేట, సీహెచ్‌ఎల్ పురం గ్రామాల్లో భూములను సర్వే చేసి గుర్తించడం జరిగిందన్నారు. రైతులతో గ్రామసభలు నిర్వహించి వారికి తెలియజేయాలని ఏపీఐఐసీ అధికారులను ఆదేశించడం జరిగిందన్నారు. కలెక్టర్ వెంట ఏపీఐఐసీ అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మ్యూల్ బ్యాంక్ ఖాతాలు సరఫరా చేస్తున్న వ్యక్తి అరెస్ట్

అల్లిపురం: ఇన్‌స్టెంట్ లోన్ యాప్‌ల కోసం మ్యూల్ బ్యాంక్ ఖాతాలు సరఫరా చేస్తున్న వ్యక్తిని సైబర్ క్రైం పోలీసులు అరెస్ట్ చేశారు. సైబర్ క్రైం పోలీసులు తెలిపిన వివరాలివి.. ఏడాది కిందట మహారాణిపేట పోలీస్ స్టేషన్ పరిధిలో లోన్ యాప్ నిర్వాహకుల వేధింపుల కారణంగా ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ కేసును దర్యాప్తు చేస్తున్న పోలీసులు, మృతుడి సెల్‌ఫోన్ ఆధారంగా క్యాస్‌మాక్స్ యాప్ ద్వారా లోన్ కార్యకలాపాలు బిహార్, రాజస్థాన్, ఢిల్లీ, కేరళ రాష్ట్రాల నుంచి సాగుతున్నట్లు గుర్తించారు. వాట్సాప్ ద్వారా వచ్చిన బెదిరింపు కాల్స్, మెసేజ్‌లు పాకిస్తాన్ నుంచి ఆపరేట్ అయినట్లు తేలింది. మృతుడి బ్యాంక్ స్టేట్‌మెంట్‌ల ద్వారా, అతను తీసుకున్న లోన్ మొత్తం అసోం, గుజరాత్‌లోని బ్యాంకు ఖాతాల నుంచి వచ్చినట్లు గుర్తించారు. అతని భార్య చెల్లించిన డబ్బులు కూడా అసోంలోని ఖాతాల్లోకి చేరినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఈ ఖాతాల నుంచి దాదాపు 9 వేల మందికి డబ్బు బదిలీ అయినట్లు పోలీసులు గుర్తించారు. వీటిని విశ్లేషించగా 61 ఖాతాల నుంచి లోన్ యాప్ ఖాతాలలో డబ్బు డిపాజిట్ అవుతున్నట్లు నిర్ధారించారు. నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు సైబర్ క్రైం పోలీసులు బిహార్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, అసోం, గుజరాత్ రాష్ట్రాలకు ప్రత్యేక బృందాలుగా వెళ్లారు. దర్యాప్తులో భాగంగా కరెంట్, సేవింగ్స్ ఖాతాలు తెరిచి లావాదేవీలు జరుపుతున్న కర్నూలు జిల్లాకు చెందిన వ్యక్తిని అరెస్ట్ చేశారు. అతను ఈ ఖాతాల ద్వారా రూ.12 లక్షల వరకు సంపాదించినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసులో ఇప్పటివరకు బిహార్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, గుజరాత్, అసోం, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఏడుగురిని అరెస్ట్ చేశారు. ఇన్‌స్టెంట్ లోన్ యాప్‌లు మళ్లీ విజృంభిస్తున్నందున.. ప్రజలు ఎవరూ ఆన్‌లైన్ లోన్‌లు తీసుకోవద్దని నగర పోలీసులు హెచ్చరించారు.

మద్యం మత్తులో స్కూల్ ఆటో డ్రైవర్ బీభత్సం

- డివైడర్‌ను ఢీకొనడంతో ఆటో బోల్తా
- ఆరుగురు విద్యార్థులకు గాయాలు



ప్రమాదానికి కారణమైన ఆటో



గాయాలపాలైన విద్యార్థులను పరామర్శిస్తున్న ఏసీపీ

అక్కిరెడ్డిపాలెం: మద్యం మత్తులో స్కూల్ ఆటోడ్రైవర్ డివైడర్‌ను ఢీకొట్టడంతో.. ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న ఆరుగురు విద్యార్థులు గాయపడ్డారు. గాజువాక ట్రాఫిక్ సీఐ కోటేశ్వరరావు తెలిపిన వివరాలివి.. గాజువాక చైతన్యనగర్‌లోని చైతన్య స్కూల్, చినగంట్యాడలోని ఏవీకే స్కూల్‌కు చెందిన ఆరుగురు విద్యార్థులను మిందికి చెందిన డ్రైవర్ ఎర్రునాయుడు మంగళవారం మధ్యాహ్నం 1.20 సమయంలో ఆటోలో ఎక్కించుకున్నాడు. అప్పటికే పూటుగా మద్యం సేవించి ఉన్న ఆయన మింది నుంచి పాతగాజువాక వైపు వెళ్తున్నాడు. భెల్ సిగ్నల్ పాయింట్ వద్ద నుంచి సర్వీసు రోడ్డులో కాకుండా.. మద్యంమత్తులో అతివేగంగా జాతీయ రహదారి ఎక్కేశాడు. పాత గాజువాక సమీపిస్తుండగా బజాజ్ షోరూం వద్దకు వచ్చే సరికి ముందు వెళ్తున్న ఫార్మా కంపెనీ బస్సును ఓవర్ టేక్ చేయబోయి డివైడర్‌ను ఢీ కొట్టాడు. దీంతో ఆటో బోల్తా పడింది. ఆటోలో ఉన్న సీహెచ్ భార్గవ్(2వ తరగతి, శ్రీ చైతన్య స్కూల్), సీహెచ్.నిమిష(8వ తరగతి, శ్రీ చైతన్య స్కూల్), సీహెచ్.భువనదీప్(5వ తరగతి, శ్రీ చైతన్య స్కూల్), కె.సాహితీ(8వ తరగతి, ఏవీకే స్కూల్), అభిరామ్(7వ తరగతి, ఏవీకే స్కూల్), మౌనిక(4వ తరగతి, శ్రీ చైతన్య స్కూల్)లకు గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు స్పందించి.. విద్యార్థులను అక్కడే ఉన్న చిన్నపిల్లల ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న ట్రాఫిక్ ఏసీపీ వాసుదేవరావు ఆస్పత్రికి వెళ్లి.. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. గాయాలపాలైన వారిని పరిశీలించారు. ఆటో డ్రైవర్ ఎర్రునాయుడును బ్రీత్ ఎనలైజర్ టెస్ట్ చేయగా 550గా నమోదైందని సీఐ తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుగా నమోదు చేసి, ప్రమాదానికి కారణమైన ఆటోడ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

చేపల వేటకు వెళ్లి.. చెరువులో శవంగా మారి..

- అనుమానాస్పదంగా వ్యక్తి మృతి
- ఇది హత్యేనంటున్న మృతుడి తల్లిదండ్రులు



ఎరుసు సంతోష్ (ఫైల్)



మృతదేహాన్ని ఒడ్డుకు తీసుకుని వస్తున్న దృశ్యం

కొమ్మాది: చెరువుకు వెళ్లి చేపలు పట్టుకుని వస్తానని చెప్పి వెళ్లిన వ్యక్తి శవమై కనిపించిన సంఘటన భీమిలి బీచ్‌రోడ్డులో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలివి. జీవీఎంసీ 4వ వార్డు కాపులుప్పాడ పరిధి రెడ్డిల పాలేనికి చెందిన ఎరుసు సంతోష్ (35) కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఖాళీ సమయంలో సమీపంలో చెరువుకు వెళ్లి చేపలు పట్టడం ఆయనకు అలవాటు. ఆయనకు నర్సిబాయ్ అనే యువతితో వివాహం అయింది. పూజిత అనే కుమార్తె ఉంది. ఇటీవల భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో ఆమె కుమార్తెతో వేరొక చోట ఉంటోంది. కాగా.. ఉగాది రోజు తల్లిదండ్రులతో కలిసి సంతోషంగా గడిపాడు. అదే రోజు సాయంత్రం చెరువుకు వెళ్లి చేపలు పట్టుకుని వస్తానని చెప్పి బయలుదేరాడు. అయితే ఆరోజు ఇంటికి రాలేదు. స్నేహితులతో కలిసి ఎక్కడికైనా వెళ్లి ఉంటాడని తల్లిదండ్రులు భావించారు. సోమవారం కూడా ఇంటికి రాకపోవడంతో అతని తండ్రి అప్పలరాజు కుటుంబ సభ్యులతో కలిసి గాలింపు చర్యలు చేపట్టారు. కాపులుప్పాడలోని చెరువులను పరిశీలించగా... ఆచూకీ లభ్యం కాలేదు. మంగళవారం చేపలుప్పాడ కంబాల చెరువు ఒడ్డున సంతోష్ శవమై కనిపించాడు. వెంటనే అప్పలరాజు తమ బంధువులు, పోలీసులకు సమాచారం అందించారు.

మృతిపై అనుమానాలెన్నో..

సంతోష్ ఆదివారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి మృతి చెందడంపై పలు అనుమానాలు రేకెత్తుతున్నాయి. అతను నీటిలో మునిగి చనిపోయాడని అనుకుంటే చెరువులో పూర్తి స్థాయిలో నీరు లేదు. పోనీ ఊబిలో చిక్కుకున్నాడని అనుకుంటే ఆయన మృతదేహం ఒడ్డున పడి ఉంది. సంతోష్ చేతులు, ముఖంపై తీవ్ర గాయాలున్నాయి. కాగా.. తన కుమారుడిని ఎవరో హత్య చేసి ఉంటారని సంతోష్ తల్లిదండ్రులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. భీమిలి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని భీమిలి మార్చురీకి తరలించారు.

స్టీల్‌ప్లాంట్ సెక్యూరిటీ విధుల్లో ఏపీ ఎస్‌పీఎఫ్



స్టీల్‌ప్లాంట్ మెయిన్ గేటు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ సెక్యూరిటీ విధుల్లోకి సీఐఎస్‌ఎఫ్ సిబ్బందితో పాటు రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్(ఎస్‌పీఎఫ్)ను నియమించబోతున్నారు. స్టీల్‌ప్లాంట్ పొదుపు చర్యల్లో భాగంగా సీఐఎస్‌ఎఫ్ సిబ్బందిని తగ్గించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా స్టీల్‌ప్లాంట్ సీఐఎస్‌ఎఫ్ యూనిట్ నుంచి సుమారు 438 మందిని తగ్గించి ఇతర ప్రాంతాలకు బదిలీ చేశారు. వారి స్థానంలో మొదట హోంగార్డులను నియమించాలనుకున్నారు. స్టీల్ ప్లాంట్ వంటి సున్నితమైన పరిశ్రమలో హోంగార్డులు సరికాదని నిర్ణయించి, ఆ స్థానంలో ఎస్‌పీఎఫ్ సిబ్బందిని నియమించాలని ప్రభుత్వాన్ని కోరారు. దీనిపై ఉత్తర ప్రత్యుత్తరాలు జరిగాయి. ఎట్టకేలకు ఆదివారం కేంద్ర ఉక్కు సహాయమంత్రి శ్రీనివాసవర్మ, ఉక్కు కార్యదర్శి సందీప్ పౌండ్రిక్‌లు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆ విజ్ఞప్తిని ప్రభుత్వం అంగీకరించినట్టు తెలిసింది. ఇందులో భాగంగా విజయవాడలోని ఏపీ ఎస్‌పీఎఫ్ డైరెక్టర్ జనరల్ కార్యాలయం ఒక సర్క్యులర్ విడుదల చేసింది. స్టీల్‌ప్లాంట్‌లో విధులు నిర్వహించడానికి ఆసక్తి కలిగిన వారు ఈ నెల 10లోగా తమ అంగీకారం తెలపాలని అందులో పేర్కొన్నారు. మొదటి దశలో 100 మందిని, ఆ తర్వాత దశల వారీగా సిబ్బందిని నియమించేందుకు అంగీకరించినట్లు ఉక్కు అధికార వర్గాల సమాచారం.

గంగవరం పోర్టులో రెండు లోకో ట్రైన్లు



కొత్త లోకో ట్రైన్

పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టులో యాజమాన్యం అదనంగా రెండు లోకో ట్రైన్‌లను మంగళవారం ప్రవేశపెట్టింది. దీంతో నౌకాశ్రయ నిర్వహణ సామర్థ్యం పెరగడంతో పాటు ర్యాక్ హ్యాండ్లింగ్ సామర్థ్యం కూడా మెరుగుపడనుంది. గంగవరం పోర్టు స్థిరంగా మెరుగైన సేవలు అందించడంతో పాటు కార్గో నిర్వహణ పరంగా కొత్త రికార్డులు సృష్టిస్తోంది. ఈ సందర్భంగా పోర్టు మేనేజ్‌మెంట్ ప్రతినిధులు మాట్లాడుతూ పోర్టులో కొత్తగా రెండు లోకో ట్రైన్‌లు ప్రారంభించడం ద్వారా దిగుమతిదారులకు గణనీయమైన ఆర్థిక ప్రయోజనాలు కల్పిస్తున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

నేటి నుంచి పాలిసెట్ ఉచిత శిక్షణ



మాట్లాడుతున్న డాక్టర్ నారాయణరావు

అనకాపల్లి టౌన్: పౌర్ణమి సేవా సంస్థ ఆధ్వర్యంలోని ఈ నెల 2వ తేదీ నుంచి పాలిటెక్నిక్ ఎంట్రన్స్ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇస్తున్నామని ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కేకేవీఏ నారాయణరావు మంగళవారం తెలిపారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్సు సమీపంలో కల్యాణి నర్సింగ్ హోం మేడపైన 12 మంది ఉపాధ్యాయులతో శిక్షణ ఇస్తామన్నారు. పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులంతా ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని పాలిసెట్‌లో మంచి ర్యాంకులు తెచ్చుకోవాలని కోరారు. 16 ఏళ్లుగా ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని, ఇక్కడ శిక్షణ పొందిన వారికి స్టడీ మెటీరియల్‌ను అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు బుద్ద సోమేశ్వరావు, మొల్లి నాగేశ్వరరావు, పెతకంశెట్టి ఆదికోటి, బొడ్డేడ కాశీ, ఆడారి శివాజీ పాల్గొన్నారు.

3 నుంచి క్రీడా పోటీలు



పోటీల కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న జార్జి క్లబ్ సభ్యులు

అనకాపల్లి టౌన్: దివంగత శరగడం మహాలక్ష్మి 66వ జయంతి సందర్భంగా ఈ నెల 3, 4, 5 తేదీల్లో బ్యాడ్మింటన్, లాంగ్ టెన్నిస్, టేబుల్ టెన్నిస్, జిమ్ కాంపిటేషన్స్ నిర్వహిస్తున్నట్లు జార్జి క్లబ్ అధ్యక్షుడు బి.ఎస్.ఎం.కె. జోగినాయుడు తెలిపారు. స్థానిక జార్జి క్లబ్ ఆవరణలో రామచంద్ర చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో జరిగే పోటీల్లో విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతోపాటు షీల్డ్ అందజేస్తామన్నారు. ఆసక్తి గలవారు 2వ తేదీలోగా పేర్లు నమోదు చేసుకోవాలని ట్రస్ట్ చైర్మన్ ఎస్.ఎస్. రామచంద్రమూర్తి కోరారు. అనంతరం పోటీల కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి బుద్ద కాశి, గంటి రవికుమార్, దాడి బుజ్జి, బాలాజీ బద్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అగ్ని గుండం



అగ్నిగుండంలో నడుస్తున్న నూకాంబిక మాలధారణ భక్తులు

అనకాపల్లి: స్థానిక తాకాశివీధి నూకాంబిక ఆలయం వద్ద అమ్మవారి మాలధారణ భక్తులు సోమవారం రాత్రి భారీ అగ్ని గుండం కార్యక్రమం నిర్వహించారు. కణకణమండే నిప్పుల గుండంపై నడిచారు. అంతకుముందు దీక్ష చేపట్టిన భక్తులు తాకాశివీధిలో అమ్మవారి ఘటాలను ఊరేగించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ తాకాశి రాజేష్ మాట్లాడుతూ నూకాంబిక స్వయంభూగా వెలసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ తాకాశి కిషోర్, తాకాశి వీధి పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

పార్లుపాలెంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

పెందుర్తి: జీవీఎంసీ 95వ వార్డు పార్లుపాలెం రైల్వే ట్రాక్ సమీపంలోని వేపాడమ్మతల్లి ఆలయం వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు మంగళవారం గుర్తించారు. దీనిపై పెందుర్తి పోలీసులకు సమాచారం అందించారు. సీఐ కె.వి.సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ అసిరితాత సిబ్బందితో వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతునికి 35–40 ఏళ్ల వయసు ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. కేసు దర్యాప్తు జరుగుతోంది.

బెల్లం ధరలు

అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు మంగళవారం 6,249 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్టధర	గరిష్టధర
స్పెషల్ రకం	3,700	4,260
మొదటి రకం	3,600	4.370
రెండో రకం	3,170	3,850
మూడో రకం	2,900	3,160

అనకాపల్లి సినిమాలు

రాజా	:ట్రైలర్
సత్యనారాయణ స్క్రీన్-1	: రాబిన్‌హుడ్
పర్తిసాయి	: కోర్టు
షిర్డీసాయి	: ఎల్2: ఎంపురాన్ (లూజిఫర్-2)
వెంకటేశ్వర	: షణ్ముఖ
శ్రీసత్య	:సంక్రాంతికి వస్తున్నాం.
రామచంద్ర	: వీర ధీర శూర

కాలుష్యం కోరల్లో గ్రామాలు

- క్వారీ లారీలతో బెంబేలు
- శిథిలమవుతున్న రోడ్లు
- దుమ్ము, ధూళి రేగి కప్పేస్తున్న వైనం
- కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు



బొజ్జన్నకొండ రోడ్డులో బండరాళ్లతో భారీ ట్రక్కులు



శంకరం వద్ద సర్వీస్ రోడ్డుపై తరచూ నిలిచిపోతున్న ట్రాఫిక్

తుమ్మపాల: పచ్చని పంటలతో ఆహ్లాదకరంగా కనిపించే గ్రామాలు కాలుష్యం కోరల్లో చిక్కుకుంటున్నాయి. విపరీతమైన దుమ్ము, ధూళి రేగి పల్లెలను కప్పేస్తోంది. మండలంలో క్వారీలు, స్టోన్ క్రషర్లు ఉన్న సంగతి అందరికి తెలిసిందే.. ఒకప్పుడు క్వారీలు ఉన్న గ్రామాల్లో మాత్రమే కాలుష్యం బారిన పడి కిడ్నీ సంబంధిత వ్యాధులతో ప్రజలు బాధపడేవారు. ఇప్పుడు ఆ కాలుష్యం మండల వ్యాప్తంగా విస్తరించింది. ప్రతి గ్రామంలోను ప్రజలు కిడ్నీ వ్యాధులతో ఆస్పత్రుల పాలవుతున్నారు. దీనికి కారణం విపరీతంగా పెరిగిపోయిన క్వారీలు, కేవలం క్రషింగ్ ద్వారా వచ్చిన ధూళితోనే ప్రజలు రోగాల బారిన పడుతుంటే, వాటికి తోడుగా భారీ బండరాళ్లతో లారీల రాకపోకలు మరింత దుమ్మును వెదజల్లుతున్నాయి.

కూటమి ప్రభుత్వంలో మైనింగ్ దోపిడీ

రాంబిల్లి మండలంలో అతిపెద్ద ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా అవసరమైన బండరాళ్లను వేల సంఖ్యలో వాహనాలు తరలించుకుపోతున్నాయి. వందల సంఖ్యలో ట్రక్కులు అపరిమిత లోడ్లతో రోడ్లపై ప్రయాణిస్తుండటంతో ఎక్కువగా ప్రమాదాలు జరగడం, ఇటీవల రైల్వే అండర్ బ్రిడ్జి కూలిపోవడం వంటి ఘటనలతో కలెక్టర్ గట్టిగానే హెచ్చరించారు. కాని క్వారీ లారీల్లో అధిక లోడ్లు ఏ మాత్రం తగ్గలేదు. కూటమి నాయకుల అండతో అధికారుల ఆదేశాలు బేఖాతరు చేస్తున్నారు. విచ్చలవిడిగా లారీలు తిరగడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతన్నారు.

గ్రామాల్లో వందల్లో ప్రయాణిస్తున్న ట్రక్కులు

మండలంలో మామిడిపాలెం, మాకవరం, మార్టూరు, ఊడేరు, బవులువాడ గ్రామాల్లో అక్రమ క్వారీలు విపరీతంగా పెరిగిపోయాయి. అనుమతులు ఉన్నవి పదుల్లో.... దోచుకుంటున్నవి వందల్లో క్వారీలు పుట్టుకొచ్చాయి. కూటమి ప్రభుత్వంలో అనుమతులతో పనిలేకుండా కొండలను పిండి చేసేస్తున్నారు. రసాయనాలతో భారీ బ్లాస్టింగ్‌లు చేసి బండరాళ్లను పల్లెల మీదుగా తరలించేస్తున్నారు. ఆయా గ్రామాల్లో క్వారీల ద్వారా దోచేసిన బండరాళ్లను రాంబిల్లి మండలంలో చేపడుతున్న భారీ ప్రాజెక్టులకు లారీలపై రాత్రింబవళ్లు తరలిస్తున్నారు. క్వారీలు ఉన్న గ్రామాల ప్రజలు గగ్గోలు పెడుతున్నా సరే పట్టించుకోకుండా తరలించుకుపోతూ పల్లెలను కాలుష్యమయం చేసేస్తున్నారు.

మండలంలో మార్టూరు మీదుగా గుంకల్లోవ, అనకాపల్లి – చోడవరం రోడ్డు మీదుగా తుమ్మపాల నుంచి బొజ్జన్నకొండకు అక్కడ నుంచి శంకరం మీదుగా అనకాపల్లి – ఆనందపురం జాతీయ రహదారికి చేరుకుని రేబాక అండర్ బ్రిడ్జి నుంచి శంకరం ఎస్సీ కాలనీ జంక్షన్ మీదుగా హైవే ఎక్కేస్తున్నాయి.

పరిమితికి మించి బండరాళ్లు తరలింపు



ఒకప్పుడు సరుకు రవాణా లారీలు మాత్రమే మా ప్రాంతంలో రాకపోకలు చేసేవి. కాని కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే బండరాళ్ల లారీలు వందల్లో తిరుగుతున్నాయి. అపరిమిత లోడ్లతో రాళ్లు వేసుకుని వెళ్తున్నారు. కొన్ని బండరాళ్లు లారీల నుంచి కింద పడుతున్నాయి. ప్రజలు రాకపోకలు చేసే మార్గాల్లో క్వారీ లారీలకు అనమతించొద్దు. ఇతర మార్గాల్లో వెళ్తే ప్రజలకు రక్షణ కల్పించినట్లు అవుతుంది. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– కె.నాగేష్, చింతనిప్పుల అగ్రహారం, అనకాపల్లి మండలం

అప్పారావుకు ఉగాది పురస్కారం



అప్పారావును సత్కరిస్తున్న విశాఖరత్న కళాపరిషత్ సభ్యులు

అనకాపల్లి టౌన్: వృద్ధుల సంక్షేమంతోపాటు వివిధ సేవా కార్యక్రమాలు చేస్తున్న అప్పారావు సేవలు వెలకట్టలేనివని పైడా కృష్ణ ప్రసాద్ అన్నారు. విశాఖపట్నం జిల్లా పౌర గ్రంథాలయంలో సోమవారం రాత్రి దాసరి నారాయణరావు కల్చరల్ అకాడమీ అనుబంధ సంస్థ విశాఖరత్న కళాపరిషత్ ఆధ్వర్యంలో ఉగాది పురస్కార వేడుకలు జరిగాయి. ఇందులో భాగంగా అనకాపల్లికి చెందిన వయోవృద్ధుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కాండ్రేగుల అప్పారావుకు ఘన సత్కారం చేశారు. కార్యక్రమంలో నాగార్జున యూనివర్సిటీ మాజీ వైస్ చాన్సిలర్ సింగశెట్టి సత్యనారాయణ, నిర్మాత, దర్శకుడు బాలమోహన్ దాస్ తదితరులు పాల్గొన్నారు.

37 మంది వితంతువులకు కొత్త పింఛన్లు

కశింకోట: మండలంలోని 37 మంది వితంతువులకు కొత్తగా పింఛన్లు మంజూరయ్యాయని ఎంపీడీవో వి.వి. రవికుమార్ తెలిపారు. భర్త మృతి చెందడంతో వచ్చిన పింఛన్ల సొమ్మును ఒక్కొక్కరికి రూ.4 వేల వంతున అందజేసినట్లు చెప్పారు. చింతలపాలెంలో ఇద్దరు వితంతువులకు కొత్తగా పింఛన్లు మంజూరు కాగా, వాటిని స్థానిక కూటమి నాయకులు పంపిణీ చేశారు.

మే 20న భవన నిర్మాణ కార్మికుల సమ్మె



మాట్లాడుతున్న కోన లక్ష్మణ్

అనకాపల్లి: కూటమి అధికారంలోకి పది మాసాలు అవుతున్నా భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయకపోవడాన్ని నిరసిస్తూ మే 20వ తేదీ నుంచి సమ్మె బాట పట్టనున్నట్టు భవన నిర్మాణ కార్మికుల సంఘం(ఏఐటీయూసీ) జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ తెలిపారు. మండలంలో మూలపేట సంఘం కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. కార్మికులవి పెండింగ్‌లో ఉన్న 46 వేల క్లెయిమ్‌లకు నిధులు మంజూరు చేయాలని, 55 ఏళ్లు నిండిన ప్రతి కార్మికుడికి రూ.6 వేలు ప్రభుత్వ పింఛన్ ఇవ్వాలని, అన్ని రాష్ట్రాల్లో ఒకే మాదిరి సంక్షేమ బోర్డు అమలతోపాటు ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో అనకాపల్లి సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్ రాజు, మారేడిపూడి సత్యనారాయణ, సభ్యులు చిన్న, గణేష్, తోట సత్తిబాబు, గులివిందుల రామునాయుడు, పల్ల నర్సింగరావు, ఉప్పిలి ఆదినారాయణ, బర్నికాన సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

మండలానికి 25 గోకులం షెడ్ల మంజూరు



త్రిపురవానిపాలెంలో గోకులం షెడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొణతాల

కశింకోట: మండలానికి రూ.50 లక్షలతో 25 గోకులం షెడ్లను మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ తెలిపారు. జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా నూతలగుంటపాలెం శివారు త్రిపుర వానిపాలెంలో గోకులం షెడ్డును ప్రారంభించి, పశువుల నీళ్ల తొట్టి నిర్మాణానికి మంగళవారం ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటికే గోకులం షెడ్లు నిర్మించుకున్న వారికి రూ.30 లక్షల వరకు చెల్లింపులు చేశామన్నారు. పశువులు నీరు తాగడానికి ఒక్కొక్కటి రూ.32 వేలతో నిర్మించుకోవడానికి నీళ్ల తొట్టెలను మంజూరు చేశామన్నారు. వీటిని ఈ నెల 10లోగా నిర్మించుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి సుభాషిణి, ఏపీడీ మణికుమార్, ఎంపీడీవో వి.వి. రవికుమార్, ఏపీవో ఎం. శ్రీనివాసరావు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

4 నుంచి శ్రీరామ నవమి ఉత్సవాలు

కశింకోట: స్థానిక గవరపేటలోని శారదా గణపతి రామాలయంలో ఈ నెల 4 నుంచి మూడు రోజుల పాటు 43వ శ్రీరామ నవమి ఉత్సవాలు పెద్ద ఎత్తున నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త భీశెట్టి దుర్గానాగేశ్వరరావు, చైర్మన్ భీశెట్టి కల్యాణ చక్రవర్తి మంగళవారం తెలిపారు. మొదటి రోజు ఉదయం 8.30 గంటలకు పెళ్లి రాట, 5న సీతారాములు, శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వార్ల మూల విరాట్ విగ్రహాలకు క్షీరాభిషేకం, 6 శ్రీరామ నవమి పురస్కరించుకొని సారెతో పాటు సీతారాముల ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ఊరేగింపు చేస్తామన్నారు. అనంతరం మధ్యాహ్నం భారీ అన్న సమారాధన, తర్వాత సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన ఉంటుందన్నారు. రాత్రి 8 గంటలకు శారదానదిపై దొనెలపై ఉత్సవ విగ్రహాలను నిలిపి శ్రీవారి తెప్పోత్సవం, అనంతరం ఊయల సేవ, పుష్పాంజలి, పవలింపు సేవ జరుపుతామన్నారు.

వరి కోతలు వాయిదా వేసుకోవాలి



మాట్లాడుతున్న ఏడీఆర్ ముకుందరావు

అనకాపల్లి: వర్ష సూచన ఉన్నందున్న కోత దశలో ఉన్న వరి పైరు కోయడం వాయిదా వేసుకోవాలని, ఇప్పటికే కోసి ఉంటే పనలను కుప్పలుగా వేసుకుని టార్పాలిన్ కప్పి జాగ్రత్తలు తీసుకోవాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ డాక్టర్ సీహెచ్.ముకుందరావు సూచించారు. మంగళవారం స్థానిక ఆర్ఏఆర్ఎస్ కార్యాలయంలో శాస్త్రవేత్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. చిరుపొట్ట దశ నుంచి గింజ గట్టిపడే దశలో ఉన్న వరి చేలుకు 5 సెం.మీ. లోతు వరకూ నీరు ఉండేలా చూసుకోవాలన్నారు. నవ్వులలో కాయ తొలుచు పురుగు ఆశించే అవకాశం ఉందన్నారు. నివారణకు క్లోరిపైరిఫోస్ 2.5 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. వాతావరణ పరిస్థితులకు వేరు, కాండం కుళ్లు తెగులు ఆశించే అవకాశం ఉందన్నారు. కాపర్ ఆక్సీ క్లోరైడ్ లేదా మాంకోజెబ్‌ను లీటరు నీటికి 3 గ్రాముల చొప్పున కలిపి మొక్కల మొదళ్లు తడిచేలా పిచికారీ చేయాలన్నారు. నువ్వు, వేరుశనగ పైరులను కోయడం వాయిదా వేసుకోవాలని కోరారు. పోషక విలువలున్న చెరకు చెత్తను పొలంలో పరచుకోవాలన్నారు. చెరకులో ఎర్రనల్లి నివారణకు కరిగే గంధకం లీటరు నీటికి 3 గ్రాముల చొప్పున లేదా డైమిథోయేట్ 2. మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. టమోటా పంటలో పూత, పిందె రాలడం నివారణకు 1 మి.లీ ప్లానోఫిక్స్ మందును 4.5 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. మామిడి తోటల్లో పిందె రాలడం నివారణకు 1 మి.లీ ప్లానోఫిక్స్ మందును 4.5 లీటర్ల నీటికి కలిపి పిచికారి చేయవచ్చన్నారు. రాగల వర్షాన్ని వినియోగించుకుని ఖాళీ పొలాల్లో వేసవి లోతు దుక్కులు దున్నుకోవాలన్నారు. శాస్త్రవేత్తలు టి.శ్రీలత, కె.వి.రమణమూర్తి, బి.భవాని, వి.చంద్రశేఖర్, పి.వి.పద్మావతి, ఎ.అలివేణి పాల్గొన్నారు.

గంజాయి కేసులో నిందితుల అరెస్ట్, రిమాండ్

పెందుర్తి: ఒడిశా నుంచి నాసిక్‌కు రూ.10 లక్షల విలువైన 180 కిలోల గంజాయిని తరలిస్తూ పోలీసులకు సోమవారం చిక్కిన కేసులో ఏడుగురు నిందితుల్లో ఐదుగురిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు వెస్ట్ జోన్ ఏసీపీ ఏబీ పృధ్వీతేజ మంగళవారం తెలిపారు. ముంచంగిపుట్‌కు చెందిన బిసోయి సహదేవ్, కొర్ర సన్యాసిరావు, మహారాష్ట్ర నాసిక్‌కు చెందిన అజయ్ సామ్ చావన్, అంకిత్ జోషి, శ్రీనివాస్ వాగ్, ఒడిశాకు చెందిన ప్రేమ్‌కుమార్, దావుద్‌ఖాన్ ఓ ముఠా. వీరిలో దావుద్‌ఖాన్, శ్రీనివాస్ వాగ్ ప్రధాన సూత్రదారులు. వీరు అల్లూరి సీతారామరాజు జిల్లా, ఒడిశా ప్రాంతాల్లోని గంజాయిని సేకరించి దేశంలోని అన్ని ప్రాంతాలకు తరలిస్తుంటారు. ఈ క్రమంలో సోమవారం ఫోర్స్ మినీ టెంపో ట్రావెలర్‌లో 180 కిలోల గంజాయిని ఒడిశా నుంచి అరకు మీదుగా నాసిక్‌కు తరలించేందుకు విశాఖ వైపు వెళుతున్నారు. వ్యాన్‌కు ముందు రెండు బైక్‌లు ఎస్కార్ట్‌గా ఉన్నాయి. సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్, పెందుర్తి పోలీసులు సీఐ కె.వి.సతీష్‌కుమార్ సారథ్యంలో పెందుర్తి మండలం రాజయ్యపేట సమీపంలో మినీ వ్యాన్‌ను అడ్డుకుని పరిశీలించగా గంజాయి పట్టుబడింది. ఐదుగురు నిందితులు సహదేవ్, సన్యాసిరావు, అజయ్, అంకిత్, ప్రేమ్‌కుమార్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని ఏసీపీ వెల్లడించారు. వారి నుంచి గంజాయి, మినీ టెంపోతో పాటు రెండు బైక్‌లు, రూ.10 వేల నగదు, ఐదు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు.

రేపు కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

కశింకోట: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 3న ఉదయం 9 గంటలకు వివిధ కార్పొరేషన్ల రుణాలకు సంబంధించి అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వి.వి. రవి కుమార్ తెలిపారు. మండలంలోని 27 గ్రామ పంచాయతీల నుంచి 631 మంది అభ్యర్థులు బీసీ, బ్రాహ్మణ, క్షత్రియ, రెడ్డి, వైశ్య, ఈబీసీ, కాపు కార్పొరేషన్ల ద్వారా వివిధ రకాల యూనిట్ల ఏర్పాటు కోసం రుణాలు పొందడానికి దరఖాస్తు చేశారన్నారు. వారికి బ్యాంకుల మేనేజర్ల సమక్షంలో ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా పెట్టుకున్న దరఖాస్తు 3 సెట్లు, రేషన్ కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల నకళ్లు, వాహనాల కోసం దరఖాస్తు చేసిన వారు డ్రైవింగ్ లైసెన్స్ మూడు సెట్ల వంతున తీసుకొని ఒరిజినల్ ఆధార్ కార్డుతో ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు.

9,836 మందికి పింఛన్ల పంపిణీ

కశింకోట: మండలంలో 9,836 మందికి పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో వి.వి. రవికుమార్ మంగళవారం తెలిపారు. మొత్తం 10,200 పింఛన్లు ఉన్నాయన్నారు. ఇళ్ల వద్ద లేకపోవడం, ఇతర ప్రాంతాలకు వెళ్లడం, తదితర కారణాల వల్ల వారికి పింఛన్ల పంపిణీ చేయలేదన్నారు. వీటిని బుధవారం అందజేస్తామన్నారు.

సాయి మెరైన్ పరిశ్రమ వ్యర్థాలతో దుర్వాసన



రంగుమారిన కాలువనీరు

ఎస్.రాయవరం: గుడివాడ రెవెన్యూ పరిధిలో సాయిమెరైన్ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ వ్యర్థాలతో దుర్వాసనతోపాటు, తాగునీరు కలుషితం అవుతుందని పరిశ్రమ ఎదుట గ్రామస్తులు మంగళవారం పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ నల్లపరాజు వెంకటరాజు, ప్రస్తుత సర్పంచ్ దూళి శ్రీనుబాబు మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో పంచాయతీ అనుమతులు లేకుండా ఏర్పాటైన పరిశ్రమ నుంచి వ్యర్థ జలాలు నేరుగా పంట కాలువ (వరహానది పాయ)లో వదిలేస్తున్నారని తెలిపారు. ఈ కాలువ నీరు పూర్తిగా కలుషితమై సమీప చెరువులు నేలబావులు, భూగర్భ జలాలు సైతం రంగుమారి దుర్గంధం వెలువడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా వ్యర్థ జలాలు నివారించకుంటే పరిశ్రమ కార్యకలాపాలకు అడ్డుపడతామని హెచ్చరించారు. ఈ క్రమంలో పరిశ్రమ ఎండీతో ఫోనో మాట్లాడగా గురు, శుక్రవారాల్లో నివారణ చర్యలు చేపడతామని హామీ ఇచ్చారన్నారు. దీంతో ఆందోళనకారులు శాంతించారు. గ్రామస్తుల ధర్నాకు వైఎస్సార్ సీపీ నాయకులు సంపూర్ణ మద్దతు తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

చినముషిడివాడలో భూ ఆక్రమణపై ఫిర్యాదు



తహసీల్దార్ ఆనంద్‌కుమార్‌కు ఫిర్యాదు చేస్తున్న మెంటి మహేష్

పెందుర్తి: జీవీఎంసీ 97వ వార్డు చినముషిడివాడ కూడలి వద్ద సర్వే నెం.113లో ప్రభుత్వ భూమిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాన్ని అడ్డుకోవాలని తహసీల్దార్ ఎం.ఆనంద్‌కుమార్‌కు వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు మెంటి మహేష్ ఫిర్యాదు చేశారు. మంగళవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో కలిసి ఈ మేరకు వినతిపత్రం అందించారు. వార్డులో టీడీపీ నాయకుల భూ కబ్జాలు ఎక్కువైపోయాయని మహేష్ అన్నారు. రూ.5 కోట్ల విలువైన స్థలాన్ని యథేచ్ఛగా ఆక్రమించుకుంటున్నారని ఆరోపించారు. గతంలో ఈ స్థలంలో నిర్మాణం చేపడితే జిల్లా రెవెన్యూ ఉన్నతాధికారులు అడ్డుకున్నారని పేర్కొన్నారు. అప్పట్లో స్వయంగా జిల్లా డిప్యూటీ కలెక్టర్ వచ్చి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. ఇప్పుడు మళ్లీ అదే స్థలంలో నిర్మాణం చేపడుతుంటే చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. అధికారులు స్పందించి ప్రభుత్వ స్థలం దురాక్రమణను అడ్డుకోవాలని కోరారు.

ప్రశాంతంగా ముగిసిన 'పది' పరీక్షలు



కశింకోటలో డీపీఎన్ హైస్కూలు నుంచి పరీక్షలు రాసి ఆనందంగా వస్తున్న విద్యార్థులు



కశింకోటలో పరీక్షలు రాసి ఆనందంగా ఇళ్లకు వెళుతున్న బాలికలు

కశింకోట: మండలంలోని ఏడు కేంద్రాల్లో నిర్వహించిన టెన్త్ పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. దాంతో విద్యార్థులు పరీక్షలు రాసి ఆనందంతో ఇళ్లకు చేరారు. భవిష్యత్‌లో ఇంటర్మీడియట్, డిగ్రీ పూర్తి చేసి ఇంజనీర్, వైద్యులు, పోలీసు, ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడాలని వారు ఆకాంక్ష వ్యక్తం చేశారు. మండలంలోని ఏడు కేంద్రాల్లో 1,037 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. వీరిలో బాలికలు ఎక్కువ శాతం మంది ఉన్నారు. కశింకోటలో బాలికల హైస్కూలు, డీపీఎన్ జెడ్పీ స్కూలు, సెయింట్ జాన్స్ స్కూలు, తాళ్లపాలెంలోని హైస్కూలు, బాలికల గురుకుల పాఠశాల, కన్నూరుపాలెం, నరసింగబిల్లి హైస్కూళ్లలో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో పరీక్షలు రాశారు. 13 ప్రభుత్వ స్కూళ్ల నుంచి రెగ్యులర్ విద్యార్థులు 833 మంది కాగా, 9 ప్రైవేటు స్కూళ్ల నుంచి 204 మంది పరీక్షలు రాశారు. వీరిలో అత్యధికంగా 635 మంది బాలికలుండగా, మిగిలిన 402 మంది బాలురున్నారు.

నూకాంబిక ఆలయానికి దివీస్ వితరణ

భక్తుల సౌకర్యార్థం ఆర్వో ప్లాంట్ ఏర్పాటు



ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న కోటేశ్వరరావు

అనకాపల్లి: కొత్త అమావాస్య జాతరలో భాగంగా గవరపాలెం నూకాంబిక ఆలయంలో భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని పరిశుభ్రమైన తాగునీటిని అందించాలని పరవాడ దివీస్ ల్యాబొరేటరీ జనరల్ మేనేజర్ వైఎస్.కోటేశ్వరరావు తెలిపారు. స్థానిక గవరపాలెం ఆలయం వద్ద దివీస్ ల్యాబొరేటరీ యాజమాన్యం సీఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్(తాగునీరు)ను మంగళవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ఏడాది నుంచి అమ్మవారి పండగను రాష్ట్ర పండగగా ప్రభుత్వం గుర్తించడంతో భక్తుల రద్దీ మరింత పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ల్యాబొరేటరీ సీఎస్ఆర్ డి.సురేష్, ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ పీలా నాగశ్రీను(గొల్లబాబు), ఆలయ సహాయ కమిషనర్ వెంపల్లి రాంబాబు, ఆలయ ధర్మకర్తలు ఎర్రవరపు లక్ష్మీ, మజ్జి శ్రీనివాసరావు, సూరే సతీష్, దాడి రవికుమార్, పొలిమేర ఆనంద్, మారిశెట్టి శంకరరావు, కాండ్రేగుల రాజారావు, వడ్డాది మంగ, కోనేటి సూర్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎండకు బెంబేలు



నిర్మానుష్యంగా గవరపేట మధ్య వీధి

కశింకోట: వేసవి ఎండలకు జనం బెంబేలెత్తిపోతున్నారు. దాంతో ప్రధాన వీధులతోపాటు చిన్న వీధులు నిర్మానుష్యమయ్యాయి. ఎండ తీవ్రతతో ప్రజలు బయటకు రావడానికి సాహసించలేదు. మంగళవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు అత్యవసర పనులున్న వారు మినహా మిగతా వారు ఇళ్లకే పరిమితమయ్యారు. దీంతో వీధులన్నీ బోసిపోయాయి. మధ్యాహ్నం 3 గంటల తర్వాత ఎండ తీవ్రత తగ్గడంతో ఒక్కొక్కరు ఇళ్ల నుంచి బయటకు వచ్చి తమ కార్యకలాపాలు నిర్వహించుకున్నారు.